సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 18 । అక్టోబర్ । 2025

వసతిగృహంలో కలెక్టర్ రాత్రి బస

పుట్టపర్తిలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని కలెక్టర్ శ్యాం ప్రసాద్ శుక్రవారం రాత్రి సందర్శించారు. విద్యార్థుల వసతి, ఆహార నాణ్యత, పరిశుభ్రత, విద్యా సదుపాయాలను స్వయంగా పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేయడంతో పాటు వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం వసతి గృహంలో బస చేశారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యాం ప్రసాద్

గరిష్ఠం/కనిష్ఠం
31.7°/20.4°

జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

'సర్'కు అన్ని పార్టీలు సహకరించాలి

- ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ సూర్యనారాయణ రెడ్డి



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న సూర్యనారాయణరెడ్డి

ప్రశాంతి నిలయం: ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పక్షాలు సహకరించాలని ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ సూర్యనారాయణరెడ్డి కోరారు. త్వరలో నిర్వహించనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)పై శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ మాట్లాడుతూ, త్వరలో జరగనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌కు అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. తప్పుల్లేని ఓటరు జాబితా తయారీకి అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. పోలింగ్ శాతం పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలు, 18 ఏళ్లపైబడిన వారిని ఓటరుగా నమోదు చేయడం, జాబితాలో మార్పులు, చేర్పులపై సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. బూత్‌స్థాయి ఏజెంట్లుగా నియమించే వారి జాబితాను ఆయా పార్టీలు వెంటనే సమర్పించాలని కోరారు. సమావేశంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ జాకీర్ హుస్సేన్, వైఎస్సార్ సీపీ ప్రతినిధి వెంకట్, టీడీపీ ప్రతినిధి ఆదినారాయణ, బీజేపీ ప్రతినిధి కళ్యాణ్ కుమార్, సీపీఎం నాయకుడు వెంకటేసులు తదితరులు పాల్గొన్నారు.

సంతలో జారిపడి ఉద్యోగి మృతి



శివ శంకర్ (ఫైల్)

సోమందేపల్లి: సోమందేపల్లిలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. రోడ్డుపై చెత్త పేరుకుపోయి.. మురుగు నీరు ప్రవహిస్తున్నా పట్టించుకునే వారే లేరు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే గురువారం వారపు సంత కాగా.. రాత్రి మార్కెట్ రోడ్డులోని ఇంటి నుంచి ద్విచక్ర వాహనంలో వస్తున్న కెనరా బ్యాంకు క్లర్క్ శివశంకర్ (52) మురుగు నీరు, కుళ్లిన కూరగాయలపై నుంచి వాహనం వెళ్లడంతో అదుపు తప్పి కింద పడ్డాడు. తలకు తీవ్ర గాయమైంది. చికిత్స కోసం బెంగళూరు తరలించగా శుక్రవారం మధ్యాహ్నం శివశంకర్ మృతి చెందారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. రోడ్డుకు అడ్డంగా కుళ్లిన కూరగాయలు, అట్ట పెట్టెలు పడి ఉన్నా పంచాయతీ సిబ్బంది తొలగించలేదు. పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే శివశంకర్ మృతి చెందారని స్థానికులు చెబుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులును వివరణ కోరగా... 'మీకు ఇష్టం వచ్చినట్టు రాసుకోండి' అంటూ నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు.

కూటమి జులుం.. గర్జించిన కలం



అవినీతి, అక్రమాలను వెలుగులోకి తెస్తున్న 'సాక్షి'పై కూటమి సర్కార్ జులుంపై కలంవీరులు కన్నెర్ర చేశారు. అక్రమ కేసులతో పాత్రికేయులను భయపెట్టలేరన్నారు. పోలీసులను ఉసిగొల్పి వేధించడాన్ని తప్పుపట్టారు. పత్రికా స్వేచ్ఛను హరిస్తున్న కూటమి సర్కార్ పద్ధతి మార్చుకోకపోతే ప్రజాస్వామ్య పద్ధతిలోనే బుద్ధి చెబుతామని హెచ్చరించారు.



కలెక్టర్ శ్యాంప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు, పాత్రికేయులు



చిలమత్తూరులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న పాత్రికేయులు, ప్రజా సంఘాల నాయకులు

- 'సాక్షి' జర్నలిస్టులపై అక్రమ కేసులపై నిరసనలు
- పాత్రికేయులపై వేధింపులు ఆపాలని డిమాండ్
- జిల్లా వ్యాప్తంగా కొనసాగిన ర్యాలీలు, ఆందోళనలు
- పత్రికా స్వేచ్ఛను హరించవద్దని పాలకులకు హితవు
- ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం

ప్రశాంతి నిలయం: ప్రజల తరఫున ప్రశ్నించడంతో పాటు పాలకుల అవినీతి, అక్రమాలను సాక్ష్యాలతో సహా ప్రజల ముందు ఉంచుతున్న 'సాక్షి' సంపాదకుడు, పాత్రికేయులపై కూటమి సర్కార్ బనాయించిన అక్రమకేసులపై నిరసనలు మిన్నంటాయి. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా పాత్రికేయులు, ప్రజా సంఘాల నాయకులు, ప్రజాస్వామ్యవాదులు కూటమి సర్కార్ నియంతృత్వ ధోరణికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఖాకీలను అడ్డంపెట్టుకుని నిరంకుశంగా వ్యవహరిస్తున్న పాలకుల తీరును ఎండగట్టారు.

పాత్రికేయులపై వేధింపులు ఆపాలి..

పుట్టపర్తిలో జరిగిన నిరసన కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే నాయకులు, పాత్రికేయులు పాల్గొన్నారు. అవినీతి, అక్రమాలపై కథనాలు రాస్తున్న పాత్రికేయులను లక్ష్యంగా చేసుకుని కూటమి ప్రభుత్వం పోలీసుల ద్వారా వేధించడం దుర్మార్గమన్నారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ శ్యాంప్రసాద్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు పుల్లయ్య మాట్లాడుతూ, రాష్ట్రంలో చోటు చేసుకున్న నకిలీ మద్యం వ్యవహారంపై వృత్తి రీత్యా పాత్రికేయులు కథనాలు ప్రచురించారని, దీన్ని జీర్ణించుకోలేని కూటమి ప్రభుత్వం 'సాక్షి' పత్రిక సంపాదకుడు ధనంజయరెడ్డికి నోటీసులు ఇవ్వడం, విచారణ పేరుతో పదే పదే కార్యాలయంలోకి పోలీసులను పంపడం సరికాదన్నారు. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించడం ప్రజాస్వామ్య వ్యవస్థకే ప్రమాదమని ప్రభుత్వం గుర్తించాలన్నారు. కూటమి ప్రభుత్వ పెద్దల ఒత్తిడికి తలొగ్గి హైదరాబాద్‌లోని 'సాక్షి' కార్యాలయంలోకి పోలీసులు పదే పదే వెళ్లి పాత్రికేయులను భయభ్రాంతులకు గురిచేసేలా ప్రవర్తించడాన్ని తాము ఖండిస్తున్నామన్నారు. నకిలీ మద్యంపై కథనాలు ప్రచురించారన్న కోపంతో 'సాక్షి' పత్రిక సంపాదకుడు ధనంజయరెడ్డిపై కేసులు నమోదు చేయడాన్ని ప్రభుత్వం పునరాలోచించుకోవాలని, ఇలాగే కొనసాగితే పాత్రికేయుల నుంచి ప్రభుత్వం ప్రతిఘటనను చవిచూడాల్సి వస్తుందన్నారు. ఇక పోలీసులు కూడా తమ పద్ధతి మార్చుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వ పెద్దలు మెప్పుకోసం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కోర్టు ముందు దోషులుగా నిలబడాల్సి వస్తుందని హెచ్చరించారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి డి.బాబు మాట్లాడుతూ.. పాత్రికేయుల పట్ల ప్రభుత్వ నిరంకుశ వైఖరి మారాలన్నారు. అవినీతిపై వార్తలు ప్రచురించిన ప్రతిసారి పాత్రికేయులపై కేసులు నమోదు చేస్తూ కక్ష సాధింపులకు దిగడం సరైంది కాదన్నారు.



జిల్లా వ్యాప్తంగా నిరసనలు

సాక్షి ఎడిటర్, జర్నలిస్టులపై అక్రమంగా బనాయించిన కేసులు వెంటనే ఎత్తివేయాలని జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులు, ప్రజాసంఘాల నాయకులు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. అన్ని నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లోనూ కూటమి సర్కార్ వైఖరికి నిరసనగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మేరకు అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు.

పత్రికా స్వేచ్ఛ అంశంలో కూటమి ప్రభుత్వం రాచరిక ధోరణి అవలంబించడం హేయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వైఖరి మార్చుకుని 'సాక్షి' పత్రిక మీద, ఎడిటర్ ధనంజయరెడ్డిపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలన్నారు. కార్యక్రమంలో 'సాక్షి' స్టాఫ్ రిపోర్టర్ దివిటి రాజేష్, పాత్రికేయులు గంగిరెడ్డి, కేశవరెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, రమణ, సతీష్ బాబు, మదన్ మోహన్‌రెడ్డి, నాగరాజు, గంగాధర్ పాల్గొన్నారు.

పాలన చేతగాకే పత్రికలపై కేసులు

- అవినీతి, అక్రమాలను బయటపెడుతోందనే 'సాక్షి'పై కూటమి కక్ష
- పత్రికా సంపాదకుడినే అక్రమ కేసులతో బెదిరించడం దుర్మార్గం
- కార్యాలయాలపైకి పోలీసులను ఉసిగొల్పి రచ్చ చేయడం నియంతృత్వం
- కూటమి సర్కార్‌పై నిప్పులు చెరిగిన మాజీ మంత్రి ఉషశ్రీచరణ్



మాట్లాడుతున్న ఉషశ్రీ చరణ్

పరిగి: ''కూటమి ప్రభుత్వానికి ఎలా పాలించాలో తెలియడం లేదు. ఆ పార్టీల్లోని వారంతా దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారు. చివరకు మద్యాన్ని కల్తీ చేసి జనాల ప్రాణాలు తీస్తున్నారు. పేదలకు వైద్యం అందించే వైద్య కళాశాలలను కమీషన్ల కోసం ప్రైవేటుకు కట్టబెట్టేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ నేపథ్యంలోనే కూటమి సర్కార్ అవినీతి, అక్రమాలకను సాక్ష్యాలతో సహా 'సాక్షి' మీడియా ప్రజల ముందు ఉంచుతోంది. దీన్ని జీర్ణించుకోలేని కూటమి పాలకులు అక్రమ కేసులతో 'సాక్షి' సంపాదకుడితో పాటు జర్నలిస్టులను భయపెట్టాలని చూస్తున్నారు. అక్రమ కేసులతో వేధిస్తున్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. అవినీతి కూటమి సర్కార్‌ను తప్పక కూలదోస్తారు'' అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. శుక్రవారం ఆమె పరిగిలో విలేకరులతో మాట్లాడారు. నిజాలు నిర్భయంగా వెలుగులోకి తెస్తున్న 'సాక్షి' ప్రతినిధులపై ప్రభుత్వ చర్యలను తప్పుపట్టారు. పోలీసులను 'సాక్షి' కార్యాలయంలోకి పంపడం పత్రికా స్వేచ్ఛను హరించడమేనన్నారు. హామీలు అమలు చేయాలని ప్రశ్నించిన వైఎస్సార్ సీపీ నాయకులపై కూడా అక్రమ కేసులు పెట్టారన్నారు. కేసులకు, బెదిరింపులకు ఎప్పుడూ భయపడేది లేదని, ప్రజల కోసం ఎంతదూరమైనా వెళ్లేందుకు వైఎస్సార్ సీపీ సిద్ధంగా ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వానికి వత్తాసు పలుకుతున్న అధికార యంత్రాంగం తీరు మార్చుకోవాలన్నారు.

సుగాలి ప్రీతికి పవన్‌కళ్యాణ్ ఏం న్యాయం చేశారు..

సుగాలి ప్రీతి కుటుంబానికి డిప్యూటీ సీఎంగా ఏం న్యాయం చేశారో పవన్‌కళ్యాణ్ చెప్పాలని ఉషశ్రీచరణ్ డిమాండ్ చేశారు. న్యాయం కోసం ప్రీతి కుటుంబసభ్యులు ధర్నా చేస్తున్నా నోరు ఎందుకు మెదపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులను అడ్డుపెట్టుకుని ప్రభుత్వాన్ని పాలిస్తారా... అని మండిపడ్డారు. కూటమి నాయకులకు రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమన్నారు. ఇకనైనా ప్రజా సమస్యలపై గళమెత్తిన వారిపై కక్ష సాధింపులకు దిగడం మానుకోవాలని హితవుపలికారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐఎస్ఐతో సంబంధాలు ఉన్న ఇద్దరు అరెస్ట్

- సింగిల్ బారెల్ రైఫిల్, సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ సతీష్ కుమార్




నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

పుట్టపర్తి టౌన్: పాకిస్తాన్ నిఘా సంస్థ ఐఎస్ఐతో సంబంధాలు ఉన్న ఉత్తర ప్రదేశ్‌కు చెందిన సాజాద్ హుస్సేన్, మహారాష్ట్రకు చెందిన తౌఫీక్ ఆలమ్ షేక్‌ను ధర్మవరం పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ శుక్రవారం పుట్టపర్తిలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో మీడియాకు వెల్లడించారు. ధర్మవరం పట్టణానికి చెందిన కొత్వాల్ నూర్ మహమ్మద్ పాకిస్తాన్‌కు చెందిన నిషేధిత ఉగ్రవాద సంస్థలతో వాట్సాప్, ఫోన్‌కాల్స్ ద్వారా సంబంధాలు నెరపడంతో అతన్ని ఈ ఏడాది ఆగస్టు 16న పోలీసులు అరెస్ట్ చేశారు. అతన్ని కస్టడీలోకి తీసుకుని విచారించగా..ఉత్తర ప్రదేశ్‌కు చెందిన సాజాద్ హుస్సేన్, మహారాష్ట్రకు చెందిన తౌఫీక్ ఆలమ్ షేక్ పాత్ర తేలింది. దీంతో ప్రత్యేక పోలీసు బృందం ఈ నెల 13న ఉత్తరప్రదేశ్ పోలీసుల సహకారంతో ఆ రాష్ట్రంలోని అమ్రోహాలో సెర్చ్ ఆపరేషన్ నిర్వహించి సాజాద్ హుస్సేన్‌ను అరెస్ట్ చేసింది. అతని నుంచి ఎలక్ట్రానిక్ పరికరాలు, జిహాద్ మెటీరియల్ స్వాధీనం చేసుకుంది. అదే రోజు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర ఏటీఎస్ బృందాలు దాడులు నిర్వహించి..మహారాష్ట్రలోని నాసిక్ సమీపంలో మాలేగావ్‌లో తౌఫీక్ ఆలమ్‌షేక్‌ను అదుపులోకి తీసుకున్నాయి. అతని నుంచి సింగిల్ బారెల్ రైఫిల్, సెల్‌ఫోన్లు, జిహాద్ మెటీరియల్ స్వాధీనం చేసుకున్నాయి. వీరిద్దరూ పాకిస్తాన్‌లోని ఉగ్రవాద సంస్థ జైషే మహమ్మద్ ఆధారిత వాట్సాప్ గ్రూప్‌లు, చానల్స్‌లో కూడా క్రియాశీలక సభ్యులుగా ఉన్నారు. వీరు యువతను జిహాదీ వైపు మళ్లించడంతో పాటు పాకిస్తాన్‌లో మిలటరీ శిక్షణ తీసుకుని భారతదేశంపై యుద్ధం చేయాలని యోచిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. అరెస్ట్ చేసిన ఇద్దరినీ పుట్టపర్తి మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. జడ్జి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

పీఎఫ్ఐ ప్రతినిధుల జిహాదీ కార్యకలాపాలు..

దేశంలో నిషేధిత పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) ప్రతినిధులు ఇతర నిషేధిత సంస్థలతో సంబంధాలు పెట్టుకుని సామాజిక సేవ పేరుతో జిహాదీ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. ముస్లిం యువతను ఉగ్రవాదం వైపు మళ్లించడంలో వీరు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. పాక్ ఆధారిత సోషల్ మీడియా గ్రూపులపై గట్టి నిఘా ఉంచామన్నారు. యువత సోషల్ మీడియాలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏమైనా సందేహాస్పద కార్యకలాపాలు, దేశ వ్యతిరేక, రాడికల్ భావాలను ప్రోత్సహించే వారి సమాచారాన్ని వెంటనే పోలీసులకు అందించాలని కోరారు. నిందితుల అరెస్టుకు శ్రమించిన ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్‌ను ఎస్పీ అభినందించారు. సమావేశంలో ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్‌తో పాటు ఎస్‌బీ సీఐ వెంకటేశ్వర్లు, ముదిగుబ్బ సీఐ శివరాముడు తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల ఎంపీడీఓకు 'షోకాజ్'



రొళ్ల: విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న స్థానిక ఎంపీడీఓ నాగేశ్వరరావు శాస్త్రికు కలెక్టర్ శ్యాం ప్రసాద్ ఆదేశాల మేరకు షోకాజ్ నోటీసును జెడ్పీ సీఈఓ శివశంకర్ జారీ చేశారు. విధుల సమయంలో కర్ణాటకలోని చంద్రబావి వద్ద ఉన్న ఓ బార్ ఎంపీడీఓ గడుపుతూ, ప్రజా సమస్యలు పట్టించుకోవడం దంటూ ఎంపీపీ కవిత, ఆమె భర్త విజయరంగేగౌడు పలుమార్లు జెడ్పీ సీఈఓకు ఫిర్యాదు చేశారు. అయినా చర్యలు తీసుకోకపోవడంతో పాలనా పరమైన ఇబ్బందులు తీవ్రమయ్యాయి. దీంతో గురువారం సాయంత్రం కలెక్టర్ శ్యాంసుందర్‌కు ఎంపీపీ ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీఓకు జెడ్పీ సీఈఓ షోకాజ్ నోటీసు జారీ చేశారు.

చీనీ ఆశలపై 'చిరుజల్లు'

పూత లేదు.. పిందె రాదు

- ఇటీవలి వర్షాలతో దెబ్బతిన్న చీనీ
- ఆందోళన చెందుతున్న రైతులు



చిల్లకొండయ్యపల్లిలో పూత, పిందెలు లేని చీనీతోట



మద్దులచెర్వులో పూత, పిందెల కోసం చీనీతోటకు మందులను పిచికారీ చేస్తున్న దృశ్యం

తాడిమర్రి: చీనీ రైతుల ఆశలపై ఆశలపై వరుణుడు నీళ్లు చల్లాడు. పంటకోత తర్వాత దాదాపు నెలరోజుల పాటు చెట్లను 'వాడు' (నీళ్లు పెట్టకపోవడం) పెడతారు. ఆ తర్వాత నీరు పెడితే పూత బాగా వచ్చి పిందెలు కూడా ఆశించిన స్థాయిలో వస్తాయి. కానీ రెండు నెలలుగా రోజు విడిచి రోజు కురుస్తున్న వర్షాలతో చీనీ రైతులు కుదేలయ్యారు. చీనీచెట్లను రైతులు వాడు పెట్టినా నిత్యం చిరుజల్లులు కురుస్తుండటంతో చీనీ చెట్లు పూతకు కూడా నోచుకోలేదు. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

37,500 ఎకరాల్లో విస్తరించిన చీనీ తోటలు..

ఎర్రనేలల్లో సాగయ్యే చీనీ నాణ్యతగా ఉండటంతో పాటు తీపిదనం ఎక్కువగా ఉండటం వల్ల మార్కెట్ డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. అందువల్ల జిల్లాలోని రైతులు ఎర్ర నేలలున్న ప్రాంతంలోనే చీనీ సాగు చేస్తున్నారు. ధర్మవరం రెవెన్యూ డివిజన్ పరిధిలోని తాడిమర్రి, బత్తలపల్లి, ముదిగుబ్బ, ధర్మవరం, కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో అధికం చీనీ తోటలు ఉన్నాయి. ఇక పెనుగొండ రెవెన్యూ డివిజన్‌లో కొన్ని మండలాల్లో రెండు, మూడు వందల ఎకరాల్లో రైతులు చీనీ తోటలను సాగు చేస్తున్నారు. మొత్తంగా 37,500 ఎకరాల్లో చీనీ తోటలు విస్తరించాయి. దాదాపు 4.50 లక్షలు చీనీ చెట్లను రైతులు సాగు చేస్తున్నారు.

దిగుబడిపై వర్షాల దెబ్బ..

ఎకరాకు 120 చెట్ల ప్రకారం ఐదు ఎకరాల్లో 600 చెట్లు ఉంటే ఆశించిన దిగుబడి, మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభిస్తే రైతు రూ.లక్షల్లో ఆదాయం చూస్తాడు. ఏడాదికి రెండు పంటలు కావడంతో రైతుకు చీనీ పంట ఎంతో లాభసాటిగా ఉంటుంది. కానీ ఇటీవల వరుసగా కురుస్తున్న తేలికపాటి వర్షాలు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఒక పంట, డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి మాసాల్లో మరో పంట చేతికి వస్తుంది. చీనీ తోటల్లో పూత రావడానికి ముందుగా రైతులు దాదాపు నెలరోజుల పాటు చెట్లకు నీరు పెట్టకుండా 'వాడు' పెడతారు. చెట్లకు ఎరువులు వేసి వాడు పెట్టిన అనంతరం ఒక్కసారి నీరు పెడితే విపరీతంగా పూత వచ్చి, పిందెలు అధికంగా వస్తాయి. దీంతో రైతుకు ఆశించిన మేర పంట దిగుబడి వస్తుంది. కానీ ప్రస్తుతం రైతులు తోటలను వాడు పెట్టగా.. వారానికి రెండు, మూడు సార్లు జల్లులు కురుస్తున్నాయి. దీంతో తోటల్లో తడి ఆరక వాడు రాకపోగా పేనుబంక, పులుసు తెగులు సోకుతున్నాయని రైతు ఆవేదన చెందుతున్నారు. ఎన్ని మందులు పిచికారీ చేసినా ప్రయోజనం లేదంటున్నారు. ఉద్యాన అధికారులు చీనీ తోటలను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరుతున్నారు.

చిరుజల్లులతోనే నష్టం



రెండు నెలలుగా జిల్లా వ్యాప్తంగా చిరుజల్లులు కురుస్తున్నాయి. దీంతో చీనీ చెట్లు వాడు పట్టడం లేదు. పదిహేను, ఇరవై రోజుల పాటు చీనీచెట్లకు నీరుపెట్టకుండా వాడు పెట్టిన అనంతరం నీరు పెడితే అధికంగా పూత వస్తుంది. తద్వారా పిందెలు ఎక్కువగా వస్తాయి. అయితే ఈ సారి వరుసగా కురుస్తున్న వర్షాలతో చెట్లకు వాడు రాలేదు.

– బిందెల బాస్వంతరెడ్డి, గుడ్డంపల్లి, తాడిమర్రి

పెట్టుబడి కూడా దక్కేలా లేదు



నేను చీనీ తోట సాగు చేస్తున్నా. దిగుబడి బాగా రావాలని రూ.లక్షలు ఖర్చు చేసి సేంద్రియ ఎరువులు, రసాయన మందులను వేస్తున్నా. ఈ సారి పూత, పిందె బాగా వస్తుందని అనుకుంటే పరిస్థితి తారుమారైంది. రోజూ వర్షం కురుస్తుండటంతో పూతనే కరువైంది. ఈ సారి పెట్టుబడులు కూడా వచ్చేట్లు కనిపించడం లేదు.

– సల్లాపురం బాలరమణారెడ్డి, తాడిమర్రి

సమగ్ర యాజమాన్యం పాటించాలి



ఏప్రిల్, మే నెలల్లో చీనీతోటల్లో కోతలు పూర్తవుతాయి. ఆ వెంటనే సేంద్రియ, రసాయన ఎరువులు వేసుకోవాలి. దీనివల్ల పూత అధికంగా వచ్చే అవకాశం ఉంది. చాలామంది రైతులు పంట కోత పూర్తయ్యాక 'వాడు' పెట్టి, పూత, పిందెలు రాగానే ఎరువులు వేసుకుంటున్నారు. దీంతోనే ఆశించిన స్థాయిలో పూత, పిందెలు రావడం లేదు. చీనీ యాజమాన్యంపై త్వరలోనే రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం.

– బండారు అమరేశ్వరి, ఉద్యాన అధికారి, ధర్మవరం

క్లుప్తంగా

జాతీయ స్థాయి పోటీలకు కదిరి విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కదిరి అర్బన్: ఈ నెల 29 నుంచి నవంబర్ 1వ తేదీ వరకు బీహార్‌లోని బేగుసరాయ్ జిల్లాలో జరిగే జాతీయ స్థాయి గోల్‌షూట్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించే ఏపీ జట్టులో కదిరి మండలం ఎరుకులవాండ్లపల్లిలో ఉన్న హరీష్ పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఎంఎస్ కిరణ్ శుక్రవారం తెలిపారు. 9వ తరగతి విద్యార్థులు శైలజ, హిమబిందు, అర్థిక ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను గోల్ షూట్ బాల్ రాష్ట్ర కార్యదర్శి మనోహర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రసన్నకుమార్, ఖాదర్‌వలీ తదితరులు అభినందించారు.

పదో తరగతి విద్యార్థుల బాహాబాహీ

కదిరి టౌన్: స్థానిక అడపాల వీధిలో ఉన్న షిరిడీ సాయి స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు గురువారం సాయంత్రం అదే పాఠశాల సమీపంలో గొడవ పడి పరస్పరం దాడులు చేసుకున్నారు. తీవ్రంగా గాయపడిన ఓ విద్యార్థి తండ్రి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన మరో విద్యార్థిపై కేసు నమోదు చేసేందుకు సీఐ నారాయణరెడ్డి సిద్ధం కాగా, విద్యార్థి తల్లి ఆందోళనకు గురైంది. పిల్లవాడి భవిష్యత్తు నాశనం అవుతుందని, రాజీ పరిష్కారం చేయాలని వేడుకుంది. అక్కడితో ఆగకుండా క్షణికావేశానికి లోనై బ్లేడుతో తన చేతికి కోసుకుంది. తీవ్ర గాయమైన ఆమెను పోలీసులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం పరస్పర ఫిర్యాదుల మేరకు ఇద్దరు విద్యార్థులపై కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

వినాయకుడి విగ్రహం అపహరణ



వినాయక విగ్రహం (ఫైల్)

అగళి: స్థానిక శంకేశ్వరస్వామి ఆలయం ఆవరణలో ఉన్న వినాయకుడి విగ్రహాన్ని గురువారం రాత్రి దుండగులు అపహరించారు. శుక్రవారం ఉదయం నిత్య పూజలు చేసేందుకు వెళ్లిన అర్చకుడు విషయాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని పరిశీలించారు. క్షుద్రపూజలు చేసిన అనంతరం వినాయకుడి విగ్రహాన్ని పెకలించుకుని వెళ్లినట్లుగా ఆనవాళ్లు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీంను రంగంలో దించి నిందితుల వేలిముద్రలను సేకరించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

టపాసులతో భద్రం

అప్రమత్తంగా లేకపోతే ప్రమాదమేనంటున్న అధికారులు



అనంతపురం కల్చరల్/సెంట్రల్: ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న వారి కోసమన్నట్లు నరక చతుర్దశి, దీపావళి పర్వదినాలు ఆది, సోమవారాల్లో వచ్చేస్తున్నాయి. మరో రెండు రోజులుండగానే ఉమ్మడి జిల్లాలో పండుగ వాతావరణం సందడి చేస్తోంది. దీపావళి అంటే ముందుగా గుర్తుకొచ్చేది టపాసుల మోతనే. పల్లెలయినా, పట్టణాలయినా దీపావళి నాడు టపాసుల మోతతో దద్దరిల్లాల్సిందే. అయితే బాణాసంచా కాల్చే సమయంలో జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని వైద్యులు, అగ్నిమాపక అధికారులు సూచిస్తున్నారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- కొనుగోలు చేసిన బాణాసంచాను ఎట్టి పరిస్థితుల్లో వంట గదిలోనో, పొయ్యి ఉన్న ప్రాంతంలోనో ఉంచకూడదు. సురక్షిత ప్రదేశంలోనే పెట్టాలి.
- పటాసులను చేతిలో పట్టుకుని కాల్చరాదు.
- టపాసులను వెలిగించిన తర్వాత పేలకపోతే వాటిపై వంగి చూడడం ప్రమాదం.
- తారాజువ్వలను సీసా, బోర్లించిన రేకు డబ్బాలో పెట్టి కాల్చే పద్ధతి కూడా ప్రమాదమే.
- టపాసులు కాల్చే సమయంలో సింథటిక్ దుస్తులు కాకుండా నూలు దుస్తులు ధరించాలి
- గాలులు విపరీతంగా ఉన్న చోట కాసేపు ఆగి టపాసులు కాల్చాలి. లేదంటే నిప్పు రవ్వలు కళ్లను దెబ్బతీసే ప్రమాదముంటుంది.
- బాణాసంచా కాల్చే సమయంలో దగ్గరగా నీటిని, ఇసుకను అందుబాటులో ఉంచుకోవాలి.
- చిన్న పిల్లలు టపాసులు కాల్చే సమయంలో ఒంటరిగా కాకుండా తల్లిదండ్రులు పక్కన ఉండాలి.
- ఒకవేళ అనుకోని పరిస్థితుల్లో బాణాసంచా వల్ల గాయపడితే సొంత వైద్యం కాకుండా వైద్యులను సంప్రదించాలి. కాలిన చోట రుద్దడం వల్ల చర్మం పాడవుతుంది. ఆస్పత్రికి వెళ్లే వరకూ తడిగుడ్డతో కప్పి ఉంచాలి.
- వీలైనంత వరకూ ఇంటి బయట మాత్రమే టపాసులు కాల్చాలి. ఇళ్లలో ప్రమాదకర వస్తువులున్నప్పుడు వాటి తీవ్రత మరింత అధికమవుతుంది.
- విపరీతమైన శబ్దాలను చెవులు భరించలేవు. చెవుల్లో దూది పెట్టుకుంటే రక్షణగా ఉంటుంది.
- అన్ని జాగ్రత్తలు పాటిస్తూనే కళ్లకు, చెవులకు, చర్మానికి ప్రమాదంలేని, పెద్ద మోత చేసే టపాసుల కన్నా తారాజువ్వలు, చిచ్చుబుడ్లు, కాకరొత్తులు, పెన్సిళ్లు, భూచక్రాల వంటి వాటితో ఆనందంగా దీపావళి జరుపుకోవడం ఉత్తమం.

జాగ్రత్తలు పాటించాలి



"టపాసులు కాల్చే సమయంలో ప్రజలు సరైన జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా ఆరుబయటే టపాసులు కాల్చాలి. ఇరుకు ప్రదేశాల్లో కాలిస్తే ప్రమాదం బారిన పడే అవకాశముంది. కాటన్ దుస్తులు ధరించాలి. టపాసులు విక్రయదారులు కూడా జాగ్రత్తలు పాటించాలని ఇప్పటికే ఆదేశాలిచ్చాం. దుకాణాలకు మధ్య దూరం ఉండాలని, డ్రమ్ముల్లో నీళ్లు, ఇసుక సిద్ధంగా ఉంచుకోవాలని సూచించాం.

–కే.పీ లింగమయ్య, అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్, జిల్లా అగ్నిమాపకశాఖ

అదరగొట్టిన రాహుల్, అభినవ్

- భారీ స్కోర్ దిశగా ఆంధ్ర జట్టు



రాహుల్ (151 నాటౌట్)



అభినవ్ (101)

అనంతపురం కార్పొరేషన్: అనంతపురం స్పోర్ట్స్ సెంటర్‌లో బీసీసీఐ ఆధ్వర్యంలో జరుగుతున్న సీకే నాయుడు ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు భారీ స్కోరు దిశగా పయనిస్తోంది. ఆంధ్ర బ్యాటర్లు ఎస్వీ రాహుల్, అభినవ్ చెలరేగి సూపర్ సెంచరీలతో రాణించారు. ఫలితంగా ఆటముగిసే సమయానికి ఆంధ్ర జట్టు 4 వికెట్లు కోల్పోయి 470 పరుగులు సాధించింది. గురువారం కురిసిన వర్షం కారణంగా శుక్రవారం రెండో రోజు మ్యాచ్ రెండు గంటల ఆలస్యంగా ప్రారంభమైంది. ఓవర్‌నైట్ స్కోర్ 210/2తో బరిలో దిగిన ఆంధ్ర బ్యాటర్ తేజ ఆట ప్రారంభమైన కాసేపటికి పెవిలియన్ ముఖం పట్టాడు. ఈ దశలో జత కట్టిన ఎస్వీ రాహుల్, అభినవ్.. ఢిల్లీ బౌలర్లను ఓ ఆట ఆడుకున్నారు. నిలకడగా ఆడుతూ.. అవకాశం దొరికినప్పుడల్లా బంతిని బౌండరీలు దాటిస్తూ భారీ స్కోర్‌కు బాటలు వేశారు. ఎస్వీ రాహుల్ 292 బంతులను ఎదుర్కొని 15 ఫోర్లు,2 భారీ సిక్సర్లతో 151 పరుగులు చేసి, క్రీజ్‌లో కొనసాగుతున్నాడు. అభినవ్ 190 బంతుల్లో 101 పరుగులు చేసి అవుటయ్యాడు. ఢిల్లీ బౌలర్లలో యగల్ షైనీ 2/37, మన్నన్, దేవ్ లక్ర చెరో వికెట్ తీసుకున్నారు.

కూటమి కుట్రలను తిప్పికొట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న మక్బూల్



సంతకాలను సేకరిస్తున్న దృశ్యం

- పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తున్న ప్రభుత్వం
- కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో కదిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మక్బూల్

గాండ్లపెంట: రాష్ట్రంలో పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే కుట్రకు కూటమి సర్కార్ తెరలేపిందని కదిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ మండిపడ్డారు. ఈ కుట్రను కోటి సంతకాలతో తిప్పికొట్టాలంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ గాండ్లపెంట మండలం కమతంపల్లి, కటారుపల్లి, తుమ్మలబైలు, తుమ్మలబైలు పెద్దతండా, గొడ్డువెలగల గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో కదిరి నియోజకవర్గ పార్టీ పరిశీలకులు కొండవీటి నాగభూషణం, పార్టీ రాష్ట్ర ఎస్‌ఈసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, మండల పార్టీ పరిశీలకులు లింగాల లోకేశ్వరరెడ్డితో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మక్బూల్ మాట్లాడుతూ.. పేద విద్యార్థులు సైతం వైద్య విద్యను అభ్యసించాలనే లక్ష్యంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా 17 వైద్య కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ కళాశాలు పూర్తయితే పేదలకు నాణ్యమైన సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ఉచితంగా అందుబాటులోకి వచ్చేదన్నారు. అయితే ఎన్నికల అనంతరం అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం... వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేసేందుకు సిద్ధం కావడం సిగ్గుచేటన్నారు. ప్రైవేటీకరణ పేరుతో తన అనుయాయులకు అప్పగించేందుకు సీఎం చంద్రబాబు కుట్ర పన్నారని ఆరోపించారు. పేదలకు నాణ్యమైన ఉచిత వైద్య సేవలు అందాలన్నా.. పేద విద్యార్థులు వైద్యను అభ్యసించాలన్నా కూటమి ప్రభుత్వ కుట్రలను తిప్పి కొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కోటి సంతకాలతో ఈ కుట్రలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి, కల్తీ మద్యంతో జనం జీవితాలతో చెలగాట మాడుతున్న కూటమి ప్రభుత్వానికి సరైన బుద్ధి చెప్పాలన్నారు. సమావేశం అనంతరం గ్రామ కమిటీలను నియమించి, సభ్యుల పేర్లను ప్రకటించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు నాగభూషణం రెడ్డి, గంగోజమ్మ, అబ్బా ఆంజనేయులు, గొడ్డువెలగల ఆంజనేయులు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్‌అలీ, మాజీ జెడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి, మండల పార్టీ ఇన్‌చార్జ్ శ్రీకాంత్‌రెడ్డి, కదిరి నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి, మండల వైస్ కన్వీనర్ శంకర్‌నాయుడు, మాజీ కన్వీనర్ చంద్రశేఖరరెడ్డి, ఉప సర్పంచ్ ఫకృద్దీన్, మండల యూత్ అధ్యక్షుడు రవిచంద్రారెడ్డి, ఎస్సీసెల్ నరసింహులు, మండల కోఆప్షన్ సభ్యుడు అమీర్‌ఖాన్, నాయకులు పామిడి ఇక్బాల్, వద్దిరెడ్డి కృష్ణారెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ గోపాలకృష్ణ, బయన్న, రామాంజులరెడ్డి, ఉత్తన్న, అజీం, దామోదర్, లీగల్ సెల్ అధ్యక్షుడు నాగేంద్రకుమార్‌రెడ్డి, స్థానిక నాయకులు హరిప్రసాదరెడ్డి, సుబ్బారెడ్డి, రామకృష్ణ, మైనుద్దీన్, శేఖర్, రాజన్న, నవీన్, గోవర్ధన్‌నాయక్, అజయ్‌నాయక్, గోవిందరెడ్డి, గిరిబాబు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

రెండేళ్లలో తుమకూరు–రాయదుర్గం రైల్వే లైన్ పూర్తి

- తుమకూరు– దావణగెర మధ్య రైల్వే లైన్ ఏర్పాటుకు చర్యలు
- రూ.47 వేల కోట్లతో 3,840 కిలో మీటర్ల రైల్వేలైన్ పనులు
- కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న వెల్లడి



మడకశిర వద్ద రైల్వే లైన్ పనులు పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి సోమన్న

మడకశిర: రాయదుర్గం–తుమకూరు రైల్వే లైన్ పనులను 2027లోపు పూర్తి చేస్తామని కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రి సోమన్న వెల్లడించారు. శుక్రవారం ఆయన హిందూపురం ఎంపీ పార్థసారథి, స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజుతో మడకశిర వద్ద తుమకూరు–రాయదుర్గం రైల్వే పనులను కలిసి పరిశీలించారు. అనంతరం కేంద్ర మంత్రి మీడియాతో మాట్లాడారు. రాయదుర్గం–తుమకూరు రైల్వే లైన్ మధ్య మొత్తం 14 రైల్వే స్టేషన్లు ఉంటాయని, అందులో మడకశిర మండలంలోని కొత్తలం, మడకశిరలోనూ రైల్వే స్టేషన్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ రైల్వే లైన్ పూర్తయిన వెంటనే తుమకూరు–దావణగెర రైల్వే లైన్ పనులను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన సర్వే, భూసేకరణ ప్రక్రియ వేగవంతంగా జరుగుతోందన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా రూ.47 వేల కోట్లతో 31 ప్రాజెక్టుల ద్వారా 3,840 కిలోమీటర్ల రైల్వేలైన్ పనులు జరుగుతున్నాయన్నారు. ఇందులో 1,600 కిలోమీటర్ల రైల్వేలైన్ పనులు పూర్తయ్యాయని వెల్లడించారు. తుమకూరు– బెంగళూరు– బెంగళూరు– తమిళనాడు మధ్య రైల్వే లైన్ల విద్యుదీకరణ పనులు చేపట్టడానికి సర్వే నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి పర్యటనలో పోలీసుల ఓవరాక్షన్

- మంత్రిని కలవడకుండా వైఎస్సార్‌సీపీ నాయకులను అడ్డుకున్న వైనం
- సరిహద్దుకు వెళ్లి కేంద్ర మంత్రికి వినతి పత్రం ఇచ్చిన నాయకులు



హరేసముద్రం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులను అడ్డుకున్న పోలీసులు

మడకశిర రూరల్: కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న పర్యటనలో పోలీసుల ఓవరాక్షన్ పతాక స్థాయికి చేరుకుంది. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ రెన్యూవల్ చేయాలని కేంద్ర మంత్రికి వినతి పత్రం ఇచ్చేందుకు వెళుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులను అడుగడుగునా అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళితే.. వివిధ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి శుక్రవారం మడకశిర ప్రాంతాలో కేంద్ర మంత్రి సోమన్న పర్యటించారు. దీంతో మంత్రిని కలిసి ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ రెన్యూవల్ చేయాలంటూ అభ్యర్థించేందుకు జిల్లా వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ హనుమంతు, సర్పంచ్ కరియన్న, బీసీసెల్ నాయకుడు తిమ్మప్ప పార్టీ వివిధ విభాగాల సభ్యులు శివానంద, లక్ష్మీనారాయణ, నాగభూషణరెడ్డి, రంగనాథ, హరి ప్రసాద్, దేవరాజ్, మైలారప్ప, రామకృష్ణప్ప తదితరులు సిద్ధమయ్యారు. తొలుత మడకశిరలోని వాల్మీకి సర్కిల్ వద్ద మంత్రికి వినతి పత్రం ఇచ్చేందుకు వేచి ఉండగా పోలీసులు అక్కడకు చేరుకుని ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని బుకాయించి వెనక్కు పంపారు. దీంతో పెనుకొండ రోడ్డులో మరోసారి వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రయత్నించారు. అక్కడ కూడా పోలీసులు అడ్డుకున్నారు. హరేసముద్రం క్రాస్ వద్ద హైవేలో వేచిఉండగా అక్కడ ఇవ్వడానికి వీలులేదని, రైల్వే స్టేషన్ నిర్మాణ ప్రాంతంలో ఇవ్వాలంటూ పంపించేశారు. రైల్వేస్టేషన్ చేరుకుని మంత్రికి వినతి పత్రం ఇవ్వడానికి ప్రయత్నించినా అక్కడ కూడా అవకాశం కల్పించకుండా అడ్డుకున్నారు. వెటర్నరీ కాలేజీ వద్దనూ షరామామూలైంది. దీంతో ఆంధ్ర సరిహద్దున కర్ణాటక పరిధిలోని చంద్రబావి గ్రామ సమీపానికి వెళ్లి రోడ్డుపైనే మంత్రికి వినతి పత్రం అందజేశారు. మడకశిర ప్రాంతంలో వినతిపత్రం ఇవ్వడానికి అనుమతించని పోలీసుల వైఖరిని మంత్రికి వివరించారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యూవల్ చేసి పేదలను ఆదుకోవాలని విన్నవించారు.

కొత్త రైల్వేలైను ఏర్పాటుకు వినతి..

మడకశిర, పెనుకొండ, ధర్మవరం, తాడిపత్రి మధ్య కొత్త రైల్వేలైన్ ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి సోమన్నకు జిల్లా వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి వినతిపత్రం అందించారు. . ఈ సందర్భంగా ఆనందరంగారెడ్డి మాట్లాడుతూ.. ఈ రైల్వేలైన్ ద్వారా హైదారాబాద్ బెంగళూరు కారిడార్ నుంచి తుమకూరు పారిశ్రామిక వాడ, నెలమంగల, డాబస్‌పేట సమీప ప్రాంతాల్లోని పారిశ్రామిక వాడలకు నేరుగా అనుసంధానం ఏర్పడుతుందన్నారు. దీని ద్వారా ప్రాంతాల అభివృద్ధికి మార్గం ఏర్పడుతుందన్నారు. మడకశిర ప్రాంతంతో పాటు జిల్లా ప్రజలకు విజయవాడ, అమరావతి, విశాఖ పట్నంకు నేరుగా రైలు మార్గం ఉంటుందన్నారు. నూతన రైల్వేలైన్ ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని కోరారు.

ఇలా ఉంటే రోగాలు రావా?

- అపరిశుభ్రతపై జెడ్పీ సీఈఓ అసహనం



పంచాయతీ అధికారులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ శివశంకర్

ధర్మవరం రూరల్: వీధుల్లో మురుగుపారుతూ అపరిశుభ్రంగా ఉంటే రోగాలు రావా? అని జిల్లా పరిషత్ సీఈఓ శివశంకర్ అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని చిగిచెర్ల గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా రోడ్లపైనే మురుగునీరు, దిబ్బలు ఉండటం చూసి పంచాయతీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. ఎవరికి వారు తమ పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇళ్లల్లోని మురుగు నీటిని రోడ్లపైకి వదలకూడదన్నారు. అనంతరం ఐవీఆర్ఎస్ కాల్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన వెంట ఎంపీడీఓ సాయిమనోహర్, డిప్యూటీ ఎంపీడీఓ వెంకటేష్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

స్వీయ పరివర్తనే సాయి బోధనల సారం



జీవనోపాధి కిట్లను పంపిణీ చేస్తున్న రత్నాకర్‌రాజు

ప్రశాంతి నిలయం: మానవతా విలువలు, ఆధ్యాత్మిక ధోరణితో ముందుకు సాగుతూ ప్రతి మనిషి స్వీయ పరివర్తన పొందాలన్నదే సత్యసాయి బోధనల లక్ష్యమని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్‌రాజు పేర్కొన్నారు. శుక్రవారం సాయికుల్వంత్ సభామందిరంలో హైదరాబాద్‌కు చెందిన 700 మంది భక్తులకు జీవనోపాధి కోసం పనిముట్లు, తోపుడు బండ్లు, వీల్‌చైర్‌లు, ఎలక్ట్రీషియన్ కిట్లు, టైలరింగ్ మెషిన్‌లు తదితర ఉపకరణాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రత్నాకర్ రాజు మాట్లాడారు.

ఐక్య ఉద్యమాలతో చేనేత పరిరక్షణ

- చేనేతలకిచ్చిన హామీలను అమలు చేయని కూటమి ప్రభుత్వం
- ఉద్యమ కార్యాచరణ నేపథ్యంలో ఈ నెల 24, 25న అధ్యయన యాత్ర
- చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు



మాట్లాడుతున్న చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు

అనంతపురం అర్బన్: ఐక్య ఉద్యమాలతోనే చేనేత రంగం పరిరక్షణ సాధ్యమవుతుందని, ఈ మేరకు ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తున్నట్లు చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాములు, గోవిందు తెలిపారు. శుక్రవారం అనంతపురంలోని ఆ సంఘం కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడారు. ఎన్నికల సమయంలో చేనేతలకు ఇచ్చిన హామీలను అధికారం చేపట్టిన తర్వాత కూటమి పెద్దలు తుంగలో తొక్కారని మండిపడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్యానికి చేనేత రంగం నిర్వీర్యమవుతోందన్నారు. నేతన్నలు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకునే దుస్థితిని కల్పిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మహత్యలు చేసుకున్న చేనేత కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం ఇప్పటికీ ఎటువంటి భరోసా ఇవ్వలేదన్నారు. మంత్రుల సొంత ఇలాకాలోనే ఈ ఘటనలు చోటు చేసుకున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. చేనేతను రక్షించుకోవడం అంటే దేశ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవడమేనని అన్నారు. తీవ్ర సంక్షోభంలో ఉన్న చేనేత రంగాన్ని రక్షించుకునే లక్ష్యంగా ఉద్యమాలు సాగిస్తామన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 24, 25 తేదీల్లో అధ్యయన యాత్ర చేపట్టి, ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తామన్నారు. చేనేత రిజర్వేషన్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, ధర్మవరం పట్టణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయం ఏర్పాటు చేయాలని, నేతన్న నేస్తం కింద రూ.25 వేలు ఆర్థిక సాయాన్ని తక్షణమే అమలు చేయాలని, నేత కార్మికులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, చేనేత పెన్షన్, ప్రత్యేక చేనేత బ్యాంక్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మధు, పురుషోత్తం, రాధాకృష్ణ, రామ్మోహన్ నాయుడు, సూర్యానారాయణ, తదితరులు పాల్గొన్నారు.